ప్రజాశక్తి
శుక్రవారం 13 డిసెంబర్ 2024   8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పింఛనుదారుల్లో

5 శాతం అనర్హులు

- పింఛన్ల తనిఖీల్లో గుర్తించినట్లు అధికారుల నివేదిక
- బాపట్ల జిల్లా, పూనూరులో 60 మంది అనర్హులుగా గుర్తింపు
- ప్రకాశం జిల్లా, చిలకపాడులో 34 మంది అనర్హులు..
- మొత్తం పింఛన్ల తనిఖీకి సిద్ధమైన రాష్ట్రప్రభుత్వం



పింఛన్ల వెరిఫికేషన్ చేస్తున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల్లో రెండు రోజుల పాటు జరిపిన పింఛన్ల తనిఖీల్లో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా అనర్హుల జాబితాలో ప్రథమ స్థానంలో నిలిచింది. అనర్హులుగా ఉన్న వారు ప్రభుత్వ పింఛన్లు పొందుతున్నారంటూ వస్తున్న ఆరోపణల నేపథ్యంలో రాష్ట్రప్రభుత్వం పింఛన్ల తనిఖీల కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ మేరకు బాపట్ల జిల్లాలో యద్దనపూడి మండలం, పూనూరు గ్రామ సచివాలయం పరిధిలో, ప్రకాశం జిల్లా లోని సంతనూతల పాడు మండలం చిలకపాడు గ్రామ సచివాలయం పరిధిలో నమూనా తనిఖీలు జరిపారు. ఇందుకోసం పక్క మండలాల నుంచి అధికారులను రప్పించి పింఛన్లు పొందుతున్న వారిలో అర్హులు, అనర్హులను గుర్తించే కసరత్తు చేపట్టారు. పూనూరు సచివాలయం పరిధిలో మొత్తం 476 మంది పింఛనుదారులు ఉండగా 447 పింఛన్ల తనిఖీలు జరిపారు. ఇందులో 385 మందిని పింఛన్లకు అర్హులుగా నిర్ధారించారు. 60 మంది పింఛను పొందేందుకు అనర్హులుగా తేల్చారు. మరో 29 మంది పింఛన్‌దారులు అందుబాటులో లేరు. ఇద్దరు పింఛనుదారులు మరణించి ▶ 2లో

చీమకుర్తిలో

నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభలు

- నేడు బహిరంగసభ..
- రేపు ప్రతినిధుల సభ ప్రారంభం
- హాజరుకానున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు





చీమకుర్తిలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

సిపిఎం 14వ జిల్లా మహాసభలు శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు చీమకుర్తిలో జరగనున్నాయి. ఇందుకోసం పార్టీ నాయకత్వం అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసింది. బివిఎస్ఆర్ కళ్యాణమండపంలో జరిగే మహాసభల ప్రాంగణానికి కామ్రేడ్ సీతారాం ఏచూరి నగర్‌గా పేరు పెట్టారు. తొలిరోజైన శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటలకు చీమకుర్తిలో ఆర్టీసీ బస్టాండు సెంటర్ నుంచి ర్యాలీకి సన్నాహాలు చేశారు. నాలుగు గంటలకు బివిఎస్ఆర్ కళ్యాణ మండపంలో బహిరంగ సభ జరగనుంది. ముందుగా మూడు రోజుల పాటు జరిగే మహాసభల్లో పార్టీ నిర్మాణపరమైన అంశాలతో పాటు అనేక ప్రజా సమస్యలపై చర్చ జరపడంతో పాటు జిల్లా అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తీర్మానాలు చేయనున్నారు. బహిరంగసభలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఉమామహేశ్వరరావులతో పాటు జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా నాయకులు పాల్గొంటారు. శనివారం నాడు ప్రతినిధుల సభ ప్రారంభమవుతుంది. రెండు రోజుల పాటు ప్రతినిధుల సభ జరుగుతుంది. చివరిరోజున నూతన కమిటీ ఎంపిక ఉంటుంది. గత మహాసభల నుంచి ఇప్పటి వరకూ పార్టీపరంగా చేపట్టిన కార్యకపాలాలపై నివేదికలు, చర్చలు ఉంటాయి. పలు సమస్యలపై తీర్మానాలను నేతలు ప్రవేశపెట్టనున్నారు. వాటిపై చర్చించిన అనంతరమే తీర్మానాల ఆమోదం ఉంటుంది. కార్యక్రమాల ▶ 2లో



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి మొయిన్

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ.7.41 లక్షల సొత్తు స్వాధీనం
- డిఎస్‌పి వెల్లడి

▶ 3లో



కరెంటు బిల్లులను దహనం చేస్తున్న సిపిఎం నాయకులు, వినియోగదారులు

టమోటా కిలో రూ.5

- భారీగా పడిపోయిన ధర
- రవాణా ఖర్చులకు కూడా రాక రైతుల ఆవేదన

ప్రజాశక్తి-మార్కాపురం

మొన్నటివరకు కిలో రూ.80 వరకు పలికిన టమోటా ధర ఒక్కసారిగా కుప్పకూలింది. ధర బాగా ఉందని పంట వేసిన రైతులు ప్రస్తుతం ధర దారుణంగా పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి పంటను సాగుచేసినా.. తీరా దిగుబడి వచ్చిన టమోటాకు మార్కెట్‌లో ధర లేదు. కిలోకి రూ.5 కూడా రైతులకు రావడం లేదు. రవాణా ఖర్చులు కూడా రాక పంటను కోయాలో, పొలంలోనే ఉంచాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.



కొనుగోలుదారుల కోసం ఎదురుచూస్తున్న టమోటా రైతు

టమోటా ధరలు మొన్నటి వరకు ఆకాశాన్నంటాయి. టమోటా కిలో రూ.80 నుంచి రూ.100కి చేరింది. ప్రజల అవసరాలకు తగిన విధంగా టమోటా అందుబాటులో లేకపోవడంతో మదనపల్లి నుంచి లారీల్లో మార్కాపురం మార్కెట్‌కు తెప్పించారు. ఇక్కడి వ్యాపారులు సిండికేట్‌గా మారిన ఫలితంగా 20 కిలోల టమోటా బాక్స్ రూ.వెయ్యికి తగ్గకుండా అమ్మారు. మార్కాపురం ప్రాంతంలో రైతులు సాగు చేసిన టమోటా ఇప్పుడు మార్కెట్‌లోకి వచ్చింది. గిద్దలూరుతో పాటు పెద్దారవీడులో టమోటా సాగు అధికంగా ఉంటోంది. తీరా ఇక్కడి టమోటా మార్కెట్‌కు రావడంతో ధర క్రమేణా తగ్గుతూ వచ్చింది. రూ.600, రూ.400 ఇలా రెండు రోజులకు ఒకసారి ధర పడిపోతూ వచ్చింది. ఇప్పుడు ధరలు పూర్తిగా పడిపోయాయి. మార్కెట్లో ఊహించని విధంగా టమాటా ధరలు పతనమయ్యాయి. టమోటా బాక్స్ ఒకటి రూ.100కు విక్రయించాల్సిన దుస్థితి రైతులకు ఏర్పడింది. ఈ లెక్కన రైతుకు కోత కూలి కూడా రావడం లేదు. ఒక్కో బాక్స్ మార్కెట్‌కు చేరవేసినందుకు వాహన యజమానులకు రూ.30 వరకు ఇవ్వాల్సి ఉంది. ఒక్కో ఎకరం టమోటా పంట సాగు కోసం రూ. 50వేలకు పైగా ▶ 2లో

విద్యుత్ ఛార్జీలు పెంచడంలో

జగన్ బాటలోనే చంద్రబాబు

విద్యుత్ బిల్లులు దహనం చేసిన సిపిఎం నేతలు

ప్రజాశక్తి-బాపట్ల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్ ధరలు పెంచబోమని ప్రజలను నమ్మించి గద్దెనెక్కిన సిఎం చంద్రబాబు ప్రస్తుతం జగన్మోహన్‌రెడ్డి బాటలోనే నడుస్తూ.. ఛార్జీలు పెంచారని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం డిస్కంల పేరుతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలకు నిరసనగా పట్టణంలోని ఉప్పరపాలెంలో గురువారం నాడు విద్యుత్ వినియోగదారులు, సిపిఎం నాయకులతో కలిసి కరెంటు బిల్లులను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం పలు దుకాణాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అదానీతో కుమ్మక్కై స్మార్ట్ మీటర్లు తెచ్చి ప్రజల నెత్తిన పెట్టారన్నారు. జగన్ అదానీతో కుమ్మక్కై వందల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడినట్లు అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు విమర్శలు చేశారన్నారు. అప్పట్లో నారా లోకేష్ స్మార్ట్‌మీటర్లను బద్దలు కొట్టాలని చెప్పినట్లు గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన విద్యుత్ భారం మోపడాన్ని గమనిస్తే ▶ 2లో

నేటి నుంచి సిపిఎం జిల్లా మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

షెడ్యూల్‌ను ఖరారు చేశారు. ఇక మహాసభల సందర్భంగా ఇప్పటివరకూ చేపట్టిన ఆందోళనలతో పాటు జిల్లాలో కొన్ని కీలక డిమాండ్లను ప్రజల ముందుంచారు. పాలకులు గుర్తించేలా ఇటీవల పలుచోట్ల సదస్సులు నిర్వహించారు. ప్రజల ఎజెండాకు సంబంధించి జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం చాలా కాలంగా డిమాండ్ చేస్తోంది. దీని కోసం పలు రూపాల్లో పోరాటాలూ నిర్వహించింది. జిల్లా వెనుకబాటు గుర్తింపు కోసం రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచీ ఆందోళనలు చేస్తూనే ఉంది. ఇటీవల కేంద్రం జిల్లాను వెనుకబడిన జిల్లాగా గుర్తించింది. వెలిగొండ ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని, నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వాలని అక్కడా ఆందోళనలు కొనసాగిస్తూనే ఉంది. ఈ ప్రాజెక్టు సొరంగాలను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు ఇప్పటికే నాలుగు పర్యాయాలు సందర్శించారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పలుమార్లు సందర్శించారు. ఇప్పటికీ వెలిగొండ అసంపూర్తిగానే మిగిలింది. ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని సిపిఎం కోరుతోంది. దీంతో పాటు గుండ్లకమ్మ, రామతీర్థం, సంగమేశ్వరం, పాలేటిపల్లి తదితర ప్రాజెక్టుల పెండింగు పనులను పూర్తిచేయాలని డిమాండ్ చేస్తోంది. కనిగిరిలో నిమ్జ్, దొనకొండలో పరిశ్రమల కారిడార్‌ను చేపట్టాలని, ప్రకాశం యూనివర్శిటీ నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని, జిల్లాలో విద్య, వైద్యం, రవాణా రంగాల్లో మెరుగైన సౌకర్యాలు చేపట్టాలని కోరుతోంది. చీమకుర్తి గ్రానైట్, మార్కాపురం పలకల పరిశ్రమలకు ప్రభుత్వం తోడ్పాటు అందించి ఉపాధిని కాపాడాలని సిపిఎం సూచిస్తోంది. ప్రజానీకానికి రక్షిత నీటిని అందించి ఫ్లోరిన్‌బారి నుంచి కాపాడాలని కోరుతోంది. పట్టణాలు, గ్రామాల్లో మౌళిక సదుపాయాల కల్పన, పెరుగుతున్న ధరలను నియంత్రణ చేయాలని, 14 రకాల సరుకులు చౌకడిపోల ద్వారా అందించాలని, పెట్రోలు, డీజిల్ గ్యాస్ రేట్ల పెరుగుదలను నివారించాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు, ఇతర భారాలు తగ్గించాలని, జిల్లాలో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలనే డిమాండ్లను సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా ప్రభుత్వాల ముందుంచింది. ఇక ఇప్పటికే మహాసభల సన్నాహకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ విజ్ఞప్తి చేశారు.

పింఛనుదారుల్లో 5 శాతం అనర్హులు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారు. ప్రకాశం జిల్లా చిలకపాడులో 397 మంది పింఛనుదారులు ఉండగా 394 పింఛన్ల తనిఖీలు జరిపారు. 355 మందిని పింఛన్లకు అర్హులుగా నిర్ధారించారు. 34 మంది పింఛన్ పొందేందుకు అనర్హులుగా తేల్చారు. ముగ్గురు పింఛన్‌దారులు అందుబాటులో లేరు. ఐదుగురు పింఛన్‌దారులు మరణించి ఉన్నట్లు తేల్చారు. ఈ మేరకు గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో జిల్లాల వారీగా అనర్హుల లెక్కలు ప్రకటించారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కన్నా బాపట్ల జిల్లా పూనూరు తనిఖీల్లో అత్యధికంగా 60 మంది అనర్హులున్నట్లు తేలింది. వికలాంగుల పింఛన్లకు సంబంధించి ఎక్కువగా అనర్హులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాల్లో జరిపిన ప్రాథమిక తనిఖీల ప్రకారం పింఛను పొందుతున్న వారిలో ఐదు శాతం అనర్హులుగా ఉన్నట్లు వెల్లడవుతున్న క్రమంలో రానున్న రెండు నెలల్లో మొత్తం పింఛన్లపై సామాజిక తనిఖీలు జరపాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది.

మద్యం అక్రమ విక్రయదారు అరెస్టు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం ఉయ్యాలవాడ గ్రామంలో గురువారం గిద్దలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ జయరావు తన సిబ్బందితో అక్రమ మద్యం అమ్మకాలపై దాడులు నిర్వహించి అనధికారికంగా మద్యం సీసాలను కలిగిఉన్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 9 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ జయరావు తెలిపారు.

గిద్దలూరు ప్రాంతీయ వైద్యశాలను

వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతాం: ఎమ్మెల్యే



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలను 2025 మార్చి నాటికి పూర్తి వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. గత వారం క్రితం వైద్యశాలను పరిశీలించారు. ఆసుపత్రి పై స్లాబ్ మొత్తం చాలా నాసిరకంగా నిర్మించారు. స్లాబ్ పైభాగం మొత్తం పగుళ్లిచ్చి, పెచ్చులు పెచ్చులుగా పైకి లేచి ఇసుక తేలుతున్నది. దీంతో భవనాలు చిన్నపాటి వర్షానికి కారుతున్నాయి. ఈ నాశిరకం భవన నిర్మాణం చూసిన ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దిగ్భ్రాంతికి గురై వెంటనే ఏపిఎంఐడిసి చీఫ్ ఇంజనీర్‌కు ఫోన్‌లో.. జరిగిన అవినీతి, నాసి రకం పనుల గురించి వివరించి, పరిశీలన చేయాలని కోరారు. ఎమ్మెల్యే అభ్యర్థన మేరకు ఏపిఎంఐడిసి చీఫ్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి గురువారం గిద్దలూరు ప్రభుత్వ వైద్యాశాలను పరిశీలించారు. ఆసుపత్రి భవన నిర్మాణం పరిశీలించిన సీఈ జరిగిన అవినీతి అవకతవకలపై విచారణ చేపట్టి సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉన్న నిధులతో స్లాబ్‌తో సహా భవన నిర్మాణాలు త్వరలో పూర్తి చేస్తామని, వారం లోపుగా ఆసుపత్రిలో మౌలిక వసతులన్నీ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ఉన్నత అధికారులు, ఏపిఎం ఐడిసి ఇంజనీర్లు, భవన నిర్మాణ కాంట్రాక్ట్ సంస్థ మేఘ సంస్థ ప్రతినిధులు, వైద్యశాల వైద్యులతో సమావేశమై వైద్యశాలలో జరిగిన నాసిరకం పనుల గురించి, జరగవలసిన అభివృద్ధిపై చర్చించి, 2025 మార్చి 31 నాటికి ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్ది పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఏపీఎంఐడీసీ సూపరింటెండింగ్ ఇంజనీర్ చిట్టిబాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజయ భాస్కర్, మేఘ కన్స్ట్రక్షన్ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మారెడ్డి, గిద్దలూరు ఏరియా వైద్యశాల సూపరింటెం డెంట్ డాక్టరు ఎస్కే ఆదం, ఆర్ఎంఓ డాక్టర్ కడప రమణారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధించేలా పనిచేయాలి

ఎంపిడిఒ జెసి చెన్నారావు

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి సాధించే దిశగా గ్రామ పంచాయతీలు పనిచేయాలని, అందుకు అన్ని ప్రభుత్వ శాఖల అధికారుల ఉమ్మడి కృషి ఎంతో అవసరమని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జెసి చెన్నారావు అన్నారు. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరిక నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయిలు వెచ్చిస్తుందని, సదరు పథకాలకు అర్హులైన వారిని గుర్తించి వారికి ప్రయోజనం చేకూర్చేలా గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించాలని, అందుకనుగుణంగా గ్రామ, మండల, అభివృద్ధి కోసం అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయం కోసం క్షేత్ర స్థాయిలో ప్రభుత్వం వివిధ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షకులు డి విజయ, ఐసిడిఎస్ అధికారి బి జ్యోతి, స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సి బాబురావు, ఎంజిఎన్‌ఆర్ఇఎస్ ఎపిఓ రమని, ఐకెపి సిసి రంగనాయకులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.5

(మొదటిపేజీ తరువాయి)

ఖర్చు చేశారు. ఈ ధరలతో 50 పైసలు కూడా లాభం రాదని తేలిపోయింది. పగలంతా కోతలు కోసుకుని... రాత్రివేళ నిద్రమానేసి మార్కెట్‌కు తరలిస్తే టమోటా ధరను చూసి నీరసించిపోతున్నారు. కిలోకి రూ.5 ధర కూడా రైతులకు రావడం లేదు. దీంతో పంటను చేలో వదిలేయాలో... మార్కెట్‌కు తరలించాలో అర్థం కాక.. టమోటా రైతన్నలు అయోమయంలో పడ్డారు.

మార్కాపురం మార్కెట్‌లో ఒకటి రెండు రోజుల్లో టమోటా ధరల్లో ఇంత భారీ తేడాకు అనేక కారణాలు ఉన్నాయి. మార్కెట్‌కు టమోటా దిగుబడి పెరగడం, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసేందుకు బయర్ల నుంచి పోటీ లేకపోవడం ప్రధాన కారణం. పొరుగు జిల్లాల్లో కూడా టమోటా దిగుబడి ప్రారంభం కావడంతో ధరలు తగ్గినట్లు తెలుస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం టమోటా రైతుకు జరుగుతున్న నష్టాలను పూడ్చేందుకు ముందుకు రావాలని రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

విద్యుత్ ఛార్జీలు పెంచడంలో జగన్ బాటలోనే చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం అదానీతో కుమ్మక్కయ్యారనే విషయం స్పష్టమవుతోందన్నారు. వినియోగదారులపై విద్యుత్ భారాన్ని మోపడాన్ని సిపిఎం వ్యతిరేకిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్లతో ప్రజలపై మోపిన రూ.20 కోట్ల ఆర్థిక భారాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వివిధ పార్టీలు, వినియోగదారుల సంఘాలు, సంస్థలు, వినియోగదారులతో కలిసి రాబోయే రోజుల్లో సిపిఎం ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.నాగేశ్వరరావు, కె.శరత్, వినియోగదారులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

- రూ. 7.41 లక్షల సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించి డిఎస్‌పి

ప్రజాశక్తి - చీరాల

ఆంధ్ర, తెలంగాణలో చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్టు చేసి రూ.7.41లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు చీరాల డిఎస్‌పి మహ్మద్ మోయిన్ తెలిపారు. స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఎస్‌పి వివరాలు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన కస్తూరి అప్పన్న అలియాస్ వీరప్పన్న అనే అంతర్ రాష్ట్ర దొంగ ఇటీవల బాపట్ల జైలు నుంచి విడుదల అయినట్లు తెలిపారు. అప్పన్నపై ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో సుమారు 72 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు రైల్వే ట్రాక్ సమీప ప్రాంతాల్లో నివసించే ఇళ్లలో రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడుతుంటాడన్నారు. బాపట్ల జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్‌పి తుషార్ డూడి చోరీలను అరికట్టేందుకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు తెలిపారు. డిఎస్‌పి మొయిన్ పర్యవేక్షణలో చీరాల వన్ టౌన్ సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రత్యేక బృందాలు నిందితుల కోసం గాలిస్తుండగా టూ టౌన్ పరిధిలోని రైల్వే స్టేషన్ వద్ద అప్పన్న ఉన్నట్లుగా సమాచారం వచ్చినట్లు తెలిపారు. దీంతో పోలీసులు అప్పన్నకు చాకచర్యంగా అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 98 గ్రాముల బంగారం,150 గ్రాముల వెండి కలిపి మొత్తం 7.41 లక్షల విలువగల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన వన్‌టౌన్ సిఐ శ్రీనివాసరావును, ఎస్ఐ. కమలాకర్ , హెడ్ కానిస్టేబుళ్లు తన్నీరు శ్రీనివాసరావు, అచ్చయ్య, ప్రసాదు, పిసిలు బాలచంద్ర కష్ణా వెంకటేశ్వర్లు నాగూరు బాషాను ఎస్‌పి తూషార్ దూడి ప్రత్యేకంగా అభినందించి రివార్డులు అందజేసినట్లు డిఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కమలాకర్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



నిందితుడి వద్ద స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి ఆభరణాలు

చెరువులో జారిపడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - వెలిగండ్ల

ప్రమాద వశాత్తు చెరువులో పడిన ఘటనలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గోప చెరువు వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని మరపగుంట్ల గ్రామానికి చెందిన చింతకాయల లక్ష్మయ్య (61) ఈనెల 9న బహిర్భమి కోసమని వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన ఆ చూకీ కోసం గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చెరువు గురువారం చెరువు వద్దకు వెళ్లాడు. ఒడ్డున ఓ మృతదేహం పడిఉండటాన్ని గుర్తించి గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం చెరువు వద్దకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మతుడు లక్ష్మయ్యగా గుర్తించారు. బహిర్భమి కోసం వెళ్లి ప్రమాద వశాత్తు జారిపడి మృతిచెంది ఉండవచ్చునని గ్రామస్తులు తెలిపారు. ఈ ఘటపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

స్థానిక బార్ అసోసియేషన్ ఆవరణలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్). కోర్టు టేబుల్ క్యాలెండర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ లాయర్లు, కక్ష దారులు, పోలీసు, కోర్టు సిబ్బందికి ఈ క్యాలెండర్ ఎంతోగానో ఉపయోగ పడుతుందన్నారు. కోర్టు సెలవులు గురించి తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసన గోపాలరావు, కార్యదర్శి గిరిధర్, సీనియర్ న్యాయ వాదులు ఒడుగు రాంబాబు,దారం సాంబశివరావు, జి. ప్రశాంత్ కుమార్, కొండపల్లి శ్రీనివాసరావు ,కె. రవికుమార్, ఐజాక్, ఎం.కష్ణా రామ్, డిహెచ్‌కెఎస్.హరి, దాసరి శ్రీవల్లి, భూషణం ఐఎఎల్ నాయకులు, కన్వీనర్ రెబ్బని, పి. నాగాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

ప్రజాశక్తి - పంగులూరు.

ఈనెల 14న నీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఇఒఆర్‌డి సుమంత్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒఆర్‌డి మాట్లాడుతూ అనేక సంవత్సరాలు తర్వాత నీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకల్లా ఎన్నికలు జరిగే ప్రాంతంలో సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, ఎన్నికలు ఫలితాల ప్రకటన సాయంత్రం ఐదు గంటల లోపు పూర్తి కావాలన్నారు. మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కె. వేణుమాధవ్ మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి- బల్లికురవ

మండల పరిధిలోని గుంటుపల్లి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో తహశీల్దారు ఎం. రవినాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దారు ప్రజలకు శాంతి సందేశం ఇచ్చారు. క్రీస్తు బోధనలు నేటి సమాజానికి అనుసరణీయంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మలినిడి గోవిందరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కారంచేడు : స్థానిక వెలుగు కార్యాలయంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఎపిఎం మోహన్ రావు క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

ప్రజలపై భారాలు దారుణం

వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు

ప్రజాశక్తి- అమృతలూరు

కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన ఆరు నెలలోనే రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందని వైసిపి వేమూరవు నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు విమర్శించారు. మండల పరిధిలోని పాంచాళవరం గ్రామంలో వైసిపి గ్రామ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపార్టీ కమిటీ అధ్యక్షుడిగా అమెరె రత్నాకర్‌ను అశోక్‌బాబు నియమించాడు. అనంతరం అశోక్ బాబు మాట్లాడుతూ సంపద సష్టిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు పెంచి పేద ప్రజలపై మరింత భారం మోపడం దారుణమన్నారు. ఉచితంగా 3 సిలిండర్లు ఇస్తానని చెప్పి ప్రజలను మోసం చేయడమే సంపద సష్టా అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు అని నమ్మబలికి తీరా అధికారం చేపట్టాక మాట తప్పటం చంద్రబాబు నాయుడుకే చెందుతుందన్నారు. ప్రజల నమ్మకాలను వమ్ము చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

రాష్ట్ర గౌడ కార్పొరేష్ చైర్మన్ గురుమూర్తి బాధ్యతల స్వీకరణకు తరలిరావాలి

ప్రజాశక్తి-పంగులూరు

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్‌గా వీరంకి గురుమూర్తి, డైరెక్టర్‌గా జంపని రామచంద్ర రావు ఈనెల 14న బాధ్యతలు చేపట్టనున్నట్లు గౌడ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి హనుమంతరావు గౌడ్ తెలిపాడు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ బెంజ్ సర్కిల్‌లోని దికష్ణ డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ హాలులో గురుమూర్తి, రామచంద్రరావు బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాక రామ్‌గోపాల్ గౌడ్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం కార్యవర్గ సభ్యులు, గౌడ వర్గీయులు పాల్గొని జయప్రదం చేయాలని హనుమంతరావు కోరారు.

ముడుపులిస్తే ఓకే..

- రోడ్డు మార్జిన్‌లోని ఇనుప గ్రిల్స్ ఇష్టారాజ్యంగా తొలగింపు
- పొంచిన ఉన్న ప్రమాదాలు
- మాముళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

216 ఎ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా చెరుకుపల్లి, గుల్లపల్లి గ్రామాలలో ప్రమాదాల నివారణ కోసం రోడ్డు మార్జిన్‌లో ఇసుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. రోడ్డు వెంబడి దుకాణాలకు ఎదురుగా కూడా గ్రిల్ ఏర్పాటు చేశారు. వ్యాపారులు, ప్రజలు జాతీయ రహదారిపైకి వచ్చేందుకు నాలుగు , ఐదు షాపులకు ఒకచోట మార్గాలు ఏర్పాటు చేశారు. అక్కడ గ్రిల్స్ ఏర్పాటు చేయలేదు. అయితే జాతీయ రహదారి ధికారులు, సిబ్బంది దుకాణదారుల నుంచి ముడుపులు తీసుకొని దుకాణాలకు ఎదురుగా ఉన్న గ్రిల్స్‌ను ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారు. గేటు సైజును బట్టి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకూ వసూలు చేస్తున్నట్లు సమాచారం. సాధారణంగా జాతీయ రహదారుల వెంబడి రహదారులకు ఎదురుగా, ఆసుపత్రులు, ప్రధాన మెడికల్ షాపులు, ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగా మాత్రమే ఖాళీ వదిలి గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంది. చెరుకుపల్లి మరియు గుళ్ళపల్లి గ్రామాలలో ఇష్టారీతిన గ్రిల్స్ తొలగించి నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

గుల్లపల్లి ఎరుకల కాలనీలో ప్రభుత్వ జడ్‌పి స్థలంలో 40 సంవత్సరాలుగా ఎరుకల కాలనీవాసులు నివాస ముంటున్నారు. ఈ కాలనీ వాసులు రాకపోకలు సాగించేందుకు వీలు లేకుండా గ్రిల్స్ ఏర్పాటు చేశారు. దీంతో వారు చాలా దూరంగా తిరిగి రావాల్సి వస్తుంది. అదేవిధంగా గుల్లపల్లి ఆంజనేయస్వామి దేవస్థానం ఎదురుగా ఒజి ఫిట్నెస్ క్లబ్ పక్కన రోడ్డు 15 అడుగుల వెడల్పు ఉంది. అక్కడ కేవలం ఆరు అడుగుల మేర ఖాళీ వదిలారు. దీంతో ఇక్కడ రాకపోకలు సాగించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు.



దుకాణాల ఎదుట తొలగించిన ఇనుప గ్రిల్స్

కరెంటు స్తంభాల ఏర్పాటులోనూ..

గతంలో రోడ్డు వెంబడి ఇనుప కరెంటు స్తంభాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కొన్ని దుకాల ఎదురుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి వస్తుంది. దుకాణాల ఎదురుగా స్తంభాలు ఏర్పాటు చేస్తామని అధికారులు యజమానులను భయపెట్టారు. దీంతో దుకాణాల యాజమానులు అధికారులను ప్రాథేపడ్డారు. కొంత నగదు ముట్టజెప్పి దుకాణాల ఎదురుగా కాకుండా కొచ్చెం దూరంగా స్తంభాలు ఏర్పాటు చేయించుకున్నారు.

భవన యాజమానుల నుంచి...

చెరుకుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి బ్యాంకు ఆఫ్ ఇండియా వరకూ రోడ్డుకు అడ్డుగా వస్తున్నాయని ఇరువైపులా ఉన్న భవన యజమానుల అప్పటో అధికారులు బెదిరించి నగదు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. భవనాల తొలగింపు విషయంలో అధికారులు, భవన యజమానుల మధ్య కొందరు మధ్యవర్తిత్వం వహించినట్లు సమాచారం. విషయంపై కొందరు భవన యజమానులు జిల్లా కలెక్టర్ సైతం ఫిర్యాదు చేశారు. మధ్యవర్తిత్వం వహించిన ఓ మాజీ ప్రజా ప్రతినిధిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.



ఓ దుకాణం ఎదుట తొలగించిన ఇనుప గ్రిల్స్

హామీలు అమలు చేయాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల

అంగన్‌వాడీల సమ్మె కాలం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ కోరారు. అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ పీడీకి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రేఖ ఎలిబిజెత్ మాట్లాడుతూ అంగన్‌వాడీలు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన సేవలు అందిస్తున్నటుల తెలిపారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గురై మృరణిస్తే కనీసం మట్టి ఖర్చులకు సైతం ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుజీవన, శైలశ్రీ, హేమ, పార్వతి,శైలజ పాల్గొన్నారు.

రేపల్లె : అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా గతంలో ప్రభుత్వ ఇచ్చిన హామీలు అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు



రేపల్లెలో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు



బాపట్లలో వినతి పంత్రం అందజేస్తున్న నాయకులు



వేమూరులో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కె.ఝాన్సీ డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని కోరుతూ ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సిడిపిఒ ఎం.సుచిత్రకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.ఝాన్సీ మట్లాడుతూ 2023 డిసెంబర్ 12 నుంచి 2024 జనవరి 22 వరకు 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగనాడీలు సమ్మె నిర్వహించినట్లు తెలిపారు.సమ్మె సందర్భంగా ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చినట్లు తెలిపారు. వాటిని ఇంతవరకూ అమలు చేయలేదన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్లైన్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్ట్ నాయకులు కె.రత్నకుమారి, టి.నిర్మల జ్యోతి,శివనాగులు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేమూరు : గతంలో అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు ఎం.రత్నకుమారి డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని కోరుతూ అమతలూరు సిడిపిఒ జి.విజయలక్ష్మి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రత్నకుమారి మట్లాడుతూ 2023 డిసెంబర్ 12 నుంచి 2024 జనవరి 22 వరకూ 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు సమ్మె నిర్వహించినట్లు తెలిపారు. ఆ సమయంలో అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు మినిట్స్ కాపీ ఇచ్చినట్లు తెలిపారు. అయినప్పటికీ సమస్యలు పరిష్కరించలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు బి. అగస్టీన్ మట్లాడుతూ హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడెన్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి ప్రమోషన్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాణి, బుల్లెమ్మాయి తదితరులు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు వైద్యశాలలో అత్యానిధునిక వైద్యపరికరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. బాపట్లలోని సూర్యలంక రోడ్డులోని యజ్ఞ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన పరేషన్ థియేటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవారు సాధారణ శస్త్ర చికిత్సలు, ఎముకలు కీళ్ల సర్జరీల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా బాపట్లలో ఆధునిక సౌకర్యాలు కల్పించిన యజ్ఞ ఆస్పత్రి యాజమాన్యాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, గోలపల శ్రీనివాసరావు, కళ్లెం హరినాథ్ రెడ్డి, చేజర్ల నారాయణరెడ్డి, ఆడిటర్ సుబ్రహ్మణ్యం, గుండె,జనరల్ వైద్యనిపుణులు యజ్ఞ శ్రీకాంత్ బెల్లంకొండ, డాక్టర్ మాధవి, ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలలో తనిఖీ చేస్తున్న బత్తుల పద్మావతి

పాఠశాలల్లో తనిఖీ

ప్రజాశక్తి- సంతమాగులూరు

సంతమాగుటూరు మండలం ఏల్చూరు గ్రామంలోని లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంతమాగులూరులోని పలు ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రాప్ అవుట్ విద్యార్థుల వివరాలు తెలుసుకొని ప్రతి విద్యార్థి కూడా ఏ కారణం చేత బడి రావడం లేదో తెలుసుకోవాలన్నారు. మళ్లీ వారిని పాఠశాలలో చేర్చుకోవాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి మేమొ ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయా పాఠశాలలోని విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి బాలల హక్కులపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీలక్ష్మి, దారా బాలయ్య, డాక్టర్ నిర్మల్ కుమార్, ఎస్‌డబ్ల్యు నూతలపాటి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమావేశం

ప్రజాశక్తి-కొల్లూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాయింట్ మండల లెవెల్ బ్యాకర్లతో ఎంపిడిఒ నరసింహారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందించాలన్నారు. సురక్ష స్కీం సురక్ష బీమా, యోజన జీవనజ్యోతి బీమా, మరియు ఆధార్ సీడింగ్ సకాలంలో చేయాలని లీక్ బ్యాంకు మేనేజర్ శివకష్ణ సూచించారు. ఈ సమావేశంలో ఎపిఎం రాము, రాంబాబు, చంద్రశేఖర్ వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.

కేరళ రాష్ట్రం పట్ల వివక్ష తగదు

రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి-బాపట్ల

కేరళ ప్రభుత్వంపై కేంద్ర ప్రభుత్వం వివక్షతో కూడిన విధానాలను అవలంభి స్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజ సంఘాలకార్యాలయంలో సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రంలోని వామపక్ష ప్రభుత్వానికి సంఘీభావంగా గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. మజుందర్ మాట్లాడుతూ దేశంలోనే అక్షరాస్యత నూరు శాతం సాధించిన రాష్ట్రంగా కేరళ ఉందన్నారు. అదేవిధంగా ఉద్యోగులు, కార్మికులు, ప్రజలకు కనీస సౌకర్యాలు, కనీస వేతనాలు అమలు చేయడంలోనూ దేశంలోనే మొదటి స్థానంలో ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం కేరళ రాష్ట్రానికి రావాల్సిన నిధులను సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులు గురిచేస్తుందన్నారు. అప్పులు తెచ్చు కోవడానికి కూడా ఆంక్షలు విధిస్తుందన్నారు. సహకార వ్యవస్థను దెబ్బతీయటం కోసం కేంద్రం పార్లమెంట్‌లో సహకార సంఘాలను నిర్వీర్యం చేసే బిల్లును ప్రవేశ పెడుతుందన్నారు. వాయినాడు వరదల్లో 400 మంది పైగా మరణిస్తే కేంద్రం జాతివిపత్తుగా ప్రకటించ లేదన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి సహాయ, సహకారాలను అందించలేదని విమర్శించారు. కేరళకు సంఘీభావంగా విస్తతంగా ప్రచారాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె. కష్ణ మోహన్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకుడు టి.సురేష్, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్. గంగయ్య, జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు వై.భాస్కరరావు ,కె.శరత్ ,ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు కష్ణవేణి, వత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ పి. కొండయ్య, టైం స్కేల్ యూనియన్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సిఐటియు పట్టణ కార్యదర్శి శామ్యూల్, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిహెచ్. మంజుదర్

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

సిపిఎం బృందం

ప్రజాశక్తి-మేదరమెట్ల

మండల కేంద్రమైన కొరిశపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సిపిఎం బందం గురువారం సందర్శించింది. ఈ సందర్భంగా వైద్యశాలలోని సదుపాయాలను పరిశీలించారు. హాస్పిటలో పరిస్థితి ఘోరంగా ఉందవని సిపిఎం బృందం అభిప్రాయపడింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ హాస్పిటల్ నూతన భవనం నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాంట్రాక్టర్ పనులు కూడా ప్రారంభించినట్లు తెలిపారు. అయితే ఇప్పటి వరకూ భవన నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. దీంతో వైద్యశాలకు పాత భవనంలోనే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాత భవనం స్లాబ్ పెచ్చులూడి పడుతున్నట్లు తెలిపారు. దీంతో భవనం ఎప్పుడు కూలిపోతుందోనని రోగులు, సిబ్బంది భయాందోళన చెందుతున్నట్లు తెలిపారు. వైద్యశాలలో ప్రతి రోజూ 50కి పైగా ఒపిలు నమోదు అవు తున్నట్లు తెలిపారు. ఈ వైద్యశాలలో ఇద్దరు వైద్యులు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే వారు ప్రజలకు సక్రమంగా అందుబాటులో ఉండటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణాన్ని పూర్తి చేయించాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్యశాలను సందర్శించిన వారిలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం .ఆంజనేయులు, ఎం.సత్యమూర్తి ,బొంతు దశరథ, వై. రవీంద్రబాబు తదితరులు ఉన్నారు.



వైద్యశాలలో పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు



కుట్టు మిషన్లు అందుకున్న మహిళలతో నూకసాని బాలాజీ, ఎమ్మెల్యే ఉగ్ర

మహిళల ఆర్థికాభివృద్ధికి..

'ఉగ్ర' సేవలు అభినందనీయం

- టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ
- మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి కనిగిరి

జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ 2వ విడతలో శిక్షణ పూర్తి చేసుకున్న పేద మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం ను గురువారం స్థానిక అమరావతి గ్రౌండ్‌లో నిర్వహించారు. మఖ్య అతిథిగా ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ హాజరై మహిళలకు కుట్టు మిషన్లు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి ఎమ్మెల్యే ఉగ్ర కృషి అభినందనీయమన్నారు. 240 మందికి కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. పార్టీ కార్యక్రమలతో పాటు సొంతంగా సేవా కార్యక్రమాలు చేస్తూ మంచి గుర్తింపు పొందారన్నారు. ప్రకాశం జిల్లాలో పర్యాటక ప్రాంతమైన భైరవ కోనకు గుర్తింపు వచ్చేలా చేస్తానన్నారు. ట్రిపుల్ ఐటీ, రిలయన్స్ సంస్థ రావటం వలన వలసలు నివారించవచ్చన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కలసి ఎంతో కలసికట్టుగా ముందుకు వెళ్తున్నాయని, విజయసాయిరెడ్డికి చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. టిడిపి సభ్యత్వం నమోదులో ఒక్క కనిగిరి నియోజకవర్గంలోనే 70 వేలు చేయడం హర్షణీయం అన్నారు.

టూరిజం హబ్‌గా భైరవకోన: ఎమ్మెల్యే ఉగ్ర

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ భైరవకోనను టూరిజం హబ్‌గా ఏర్పాటు చేసేందుకు టూరిజం కార్పొరేషన్ చైర్మన్ బాలాజీ కృషి చేయాలన్నారు. కనిగిరి నియోజకవర్గాన్ని ప్రత్యేక దృష్టితో తీసుకోవాలన్నారు. సేవా కార్యక్రమాలు కొనసాగిస్తానని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే జాతికి అంకితం చేశామని వైసిపి నాయకులు చెప్పుకుంటున్నారని విమర్శించారు. శిక్షణ తీసుకున్న మహిళలు ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు తమ్మినేని శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నంబుల వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ల పిచ్చాల శ్రీనివాసరెడ్డి, టిడిపి నాయకులు ముచ్చుమారి చెంచు రెడ్డి, షేక్ ఫిరోజ్, తమ్మినేని వెంకట్‌రెడ్డి, బాలు ఓబుల్ రెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, జి నాగిరెడ్డి, ఐవి నారాయణ, సిహెచ్ నాగార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాల 'కూటమి ప్రభుత్వానికి'

ప్రజలు చరమగీతం పాడతారు

వైసీపీ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి



ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ,చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, దద్దాల నారాయణను సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి -కనిగిరి

కూటమి ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని వైసీపీ జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. కనిగిరి నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం గురువారం కనిగిరి పట్టణంలోని పవిత్ర కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అబద్దాల ప్రభుత్వం నడుస్తుందన్నారు. రానున్న రోజుల్లో ప్రజలందరూ ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడతారని అన్నారు. జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ సౌమ్యుడు, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తి నారాయణ విజయానికి కృషి చేయాలని తెలిపారు. ఒంగోలు పార్లమెంట్ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఈవీఎంలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న తరుణంలో అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను నిషేధించి బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికల నిర్వహిస్తున్నాయని ఆయన అన్నారు. ఏది ఏమైనా 2029లో జగనన్న తిరిగి ముఖ్యమంత్రి అవుతారని అన్నారు. ఉమ్మడి జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్న ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ కార్యకర్తలందరికీ అందుబాటులో ఉండి నాయకులను సమన్వయం చేసుకొని వచ్చే ఎన్నికల్లో వైసీపీ విజయం కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జడ్పీటీసీ మడతల కస్తూరి రెడ్డి, నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

చీమకుర్తిలో ఈనెల 13 నుంచి 15 వరకు నిర్వహించనున్న సీపీఎం 14వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని హనుమంతుడుపాడు, పెదచెర్లోపల్లి మండలాల ప్రాంతీయ కమిటీ కన్వీనర్ బడుగు వెంకటేశ్వర్లు తెలిపారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో మహాసభల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 13వ తేదీన చీమకుర్తి బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి నాలుగు గంటలకు బివిఎస్ఆర్ కల్యాణ మండపంలో బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సభకు సిపిఎం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిపై భవిష్యత్తు పోరాటాల ప్రణాళిక రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జరిగే బహిరంగ సభలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కత్తి ఏబు, రమేష్, అనోస్, రాములు తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు

పోర్టుల అభివృద్ధికి సహకరించండి



కేంద్ర మంత్రి శరబానంద సోనోవాల్‌తో చర్చిస్తున్న దామచర్ల సత్య

కేంద్ర మంత్రిని కలిసిన మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య

ప్రజాశక్తి-టంగుటూరు

పోర్టుల అభివృద్ధికి సహకరించాలని కేంద్ర నౌకాయాన శాఖ మంత్రి శరబానంద సోనోవాల్‌ను ఎపి మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య కోరారు. గురువారం ఆయన ఢిల్లీలో కేంద్ర మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఆంధ్రప్రదేశ్ తీరప్రాంత అభివృద్ధిపై వీరు చర్చించుకున్నారు. రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధి, శిక్షణా కేంద్రం ఏర్పాటు, ఓడల తయారీ యూనిట్ ఏర్పాటు వంటి పలు అంశాల మీద దృష్టి సారించాలని దామచర్ల సత్య కోరారు. సత్య ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

జనం మెచ్చిన మనిషి పుల్లయ్య

- ఉద్యోగ, కార్మిక ఉద్యమంలో చురుకైన పాత్ర
- పేదల గళంగా ప్రశంసించిన జాతీయ పత్రిక ఇండియాటుడే..



ప్రజాశక్తి-మార్కాపురం

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి అభ్యుదయ భావాలతో ఉద్యోగ, కార్మిక ఉద్యమంలో కీలక భూమిక పోషించారు ఏనుగుల పల్లయ్య. ఉద్యోగ విరమణ అనంతరం ఎర్రజెండా నీడలో ప్రజల పక్షాన నిలిచి సమస్యలకు పరిష్కారం చూపి 'జనం మెచ్చిన మనిషి'గా ముద్రపడ్డారు. చూడటానికి బక్కపలచగా అగుపించే పుల్లయ్య వామపక్ష ఉద్యమంలో తారాజువ్వలా ప్రజలకు చేరువయ్యారు. ప్రకాశం జిల్లా పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో పేదరైతు కుటుంబానికి చెందిన గురవయ్య, నారాయణమ్మ దంపతులకు జన్మించారీయన. వేములపాడులో ప్రాథమిక విద్య చదివి కంభం హైస్కూల్‌లో ఎస్ఎస్ఎల్‌సి, గుంటూరు ఇసి కళాశాలలో ఎఫ్.ఎ కోర్సు చేశారు. విద్యార్థి ఉద్యమం పట్ల ఆకర్షితులైన ఈయన స్టూడెంట్ ఫెడరేషన్‌లో చురుగ్గా పనిచేశారు.

1953 కర్నూలు రాజధానికి ఉన్నప్పుడు అప్పటి శాసనసభ (సెక్రెటేరియల్) కార్యాలయంలో ఉద్యోగం చేశారు. తరువాత పోస్టల్ శాఖకు బదిలీపై వచ్చారు. అక్కడే సుదీర్ఘ కాలం పనిచేసిన ఆయన పోస్టల్ ఉద్యోగి కార్మిక సంఘం (సి.ఐ.టి.యు అనుబంధం)లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం మార్కాపురానికి మకాం మార్చారు. గోను పాపిరెడ్డి సహకారంతో మార్కాపురం ప్రాంతంలో సిపిఎం విస్తరణకు కీలక భూమిక పోషించారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని యర్రగొండపాలెం, కంభం, గిద్దలూరు ప్రాంతాల్లో పార్టీని విస్తరింపజేశారు. ముఖ్యంగా మార్కాపురం డిజైన్ పలకల కార్మికుల సమస్యలపై పెద్ద ఎత్తున ఉద్యం (సి.ఐ.టి.యు అనుబంధం సంఘంగా) నడిపారు. పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రాంతంలో సి.ఐ.టి.యు. విస్తరణకు విస్తృతంగా కృషి చేశారు. పట్టణంలో ఇళ్లు లేని పేదలు, కార్మికులు, చేతివృత్తిదారులను ఐక్యం చేసి ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేయించడం తద్వారా భగత్‌సింగ్ నగర్, సుందరయ్య నగర్ నిర్మాణంలో ఆయన చేపట్టిన ఉద్యమం పలు ఉద్యమాల నిర్మాణానికి దోహదం చేశాయి.




ఎంతోమంది యువతను కమ్యూనిస్టు ఉద్యమం వైపు ఆకర్షితులయ్యేలా ప్రోత్సహించారు. ఆయన మాటకు పేదలు ఎంతో విలువనిచ్చేవారు. ఒకసారి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి హోదాలో మార్కాపురంలో బహిరంగసభ ఏర్పాటు చేశారు. సభలో చంద్రబాబు ప్రసంగాన్ని ప్రజలు నిరసించారు. నిరసనలను అదుపు చేయడం పోలీసుల వల్ల కాలేదు. ఈ దశలో పుల్లయ్య వేదికపైకి వచ్చి చేయి ఊపడంతో ప్రజలు మౌనం వహించారు. తమ పక్షాన ముఖ్యమంత్రితో మాట్లాడటానికి (చర్చించడానికి) పుల్లయ్యను పంపారు. ఈ ఘటనను ఉటంకిస్తూ జాతీయ పత్రిక ఇండియా టుడే పుల్లయ్యను పేదల గళమని పేర్కొంటూ బక్కపలచని శరీరంతో కనిపించే పుల్లయ్య సైద్ధాంతిక యోధునిగా కీర్తించడం విశేషం. ప్రజాభిమానమే ఆయన తరగని ఆస్తి.

అభ్యుదయ పత్రిక ప్రజాశక్తి మార్కాపురంలో విలేకరిగానూ ఆయన చాలాకాలం పనిచేశారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో పత్రిక అభివృద్ధికి కీలకంగా పనిచేశారు. 1991 నుంచి 2004 వరకు సిపిఎం మార్కాపురం డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. 1995 నుంచి 2008 వరకు సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ సభ్యునిగా కొనసాగారు. మార్కాపురం రెవెన్యూ డివిజన్ ప్రాంతంలో వామపక్ష ఉద్యమ నిర్మాణంలో కీలకంగా ఉన్నారు. తుదిశ్వాస వరకు తాను నమ్మిన వామపక్ష సిద్ధాంతానికి కట్టుబడి ప్రజలే ఊపిరిగా ఉద్యమమే శ్వాసగా జీవించారు. 2009 ఫిబ్రవరి 7న అనారోగ్యంతో మృతిచెందిన పుల్లయ్య సేవలను గుర్తిస్తూ ఆయన అభిమానులు పోస్టాఫీసు సెంటర్లో విగ్రహాన్ని ప్రతిష్టించారు. పేదల పక్షాన నిస్వార్థంలో పనిచేసి జనం మెచ్చిన మనిషిగా గుర్తింపు పొందిన ఏనుగుల పుల్లయ్య జీవితం భావితరాలకు ఆదర్శం.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్‌డిఓ కేశవ వర్ధన్ రెడ్డి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పామూరు

ప్రభుత్వం పగడ్బందీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఆర్‌డిఓ కేశవ వర్ధన్ రెడ్డి తెలిపారు. చింతలపాలెం పంచాయతీ పరిధిలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారన్నారు. సమస్యలు ఉంటే అర్జీల ద్వారా ఇవ్వాలని సూచించారు. పాసుబుక్కులు రాని వారు, ఆన్‌లైన్ కాని వారు ఉంటే అర్జీలు పెట్టుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పానకాలరావు, తహశీల్దార్ బివి రమణారావు, సర్పంచ్ ఎం.గురవయ్య, ఆర్‌ఐ బత్తుల మల్లికార్జునరావు, మండల సర్వేయర్ స్నేహ, వీఆర్వో రమేష్, విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి మండలం పునుగోడులో గురువారం రెవెన్యూ సదస్సును తహశీల్దార్ సిహెచ్ అశోక్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజల నుంచి సమస్యలతో కూడిన వినతులను స్వీకరించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి భూములు ఆన్‌లైన్ చేయాలని కోరుతూ తహశీల్దార్ అశోక్ కుమార్‌కు టిడిపి నాయకులు సుదురుపాటి సుబ్బయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నంబుల వెంకటేశ్వర్లు, మాలపాటి ఓబుల్ రెడ్డి, షేక్ బారా ఇమామ్ పాల్గొన్నారు.

సిఎస్ పురంరూరల్: మండలంలోని ఏకునాంపురం, తుమ్మకుంట గ్రామాలలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మంజునాథరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో పేర్లు మార్పులు, భూ సర్వే వివరాలు, పాస్ పుస్తకాలు తదితర భూ సంబంధిత సమస్యలను ఈ రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకునే అవకాశం ఉందని చెప్పారు. రైతుల నుంచి 29 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు (వెంగయ్య), కామనబోయిన వెంకటస్వామి, వీఆర్వో యు.మాలకొండయ్య, సర్వేయర్ గురు ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

పొదిలి: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ షాహిదా అన్నారు. మంగళవారం మండలంలోని కంబాలపాడు, జాఫ్లాపురం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. భూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ గురవయ్య, దేవస్థానం ఈవో పి.రామకృష్ణారావు, వీఆర్వో బాబాజీ, టిడిపి నాయకులు ఆవులూరి కోటప్ప నాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గనివెనపాడు, బోడపాడు గ్రామాలలో గురువారం తహశీల్దార్ ఆవుల సురేష్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఆవుల సురేష్ మాట్లాడుతూ గ్రామాలలో భూ సమస్యలు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకువచ్చినట్లయితే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో తిరిగి కాలనీవాసులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనివెనపాడు, బోడపాడు లో 12 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పాలూరి లక్ష్మి వెంకటేశ్వర్లు, బూదాల జోసెఫ్ కమలాకర్‌రావు, ఆర్‌ఐ మాదేవరెడ్డి, మండల సర్వేయర్ రాజశేఖర్, విఆర్‌ఓలు, కంప్యూటర్ , సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

దర్శి: మండలంలోని పోతకమూరు, పాపిరెడ్డి పాలెం రెవెన్యూ సదస్సులో 23 దరఖాస్తులు వచ్చినట్లు స్థానిక తహశీల్దార్ ఎం.శ్రావణ్‌కుమార్ తెలిపారు. గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 22 ఆన్‌లైన్‌కు, ఒకటి పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి వెంకటేశ్వరరావు, ఆర్‌ఐ శ్రీనివాసరావు, విఆర్‌ఓ సుధాకర్, సచివాలయం ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కనిగిరి సీడీపీఓ పి.సరోజినీ ఒక ప్రకటనలో తెలిపారు. కనిగిరి ప్రాజెక్టులో పామూరు మండలంలోని నుచ్చుపొద ఆయా, కనిగిరి మండలంలోని పునుగోడు జనరల్ ఆయా అంగన్‌వాడీ పోస్టులు ఉన్నాయని తెలిపారు. వెలిగండ్ల ప్రాజెక్టు పరిధిలో సీఎస్‌పురం మండలంలోని మునగాలవారి పల్లి మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆర్వేపల్లి ఆయా పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 23వ తేదీలోపుగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

సిఎస్ పురం: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని వెలిగండ్ల ఇన్‌చార్జి సిడిపిఓ సరోజిని గురువారం తెలిపారు. మునగాలవారిపల్లిలో మినీ అంగన్‌వాడి కార్యకర్త పోస్టు, ఆర్‌కె.పల్లి అంగన్‌వాడి కేంద్రం-1లో ఆయా పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. పై రెండు పోస్టులు జనరల్ కేటగిరీ కింద కేటాయించబడినట్లు తెలిపారు. దరఖాస్తుదారులు వివాహిత అయి ఉండి ఆ గ్రామంలో నివాసం కలిగి ఉండాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ లోపు సీడీపీఓ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు.

దర్శి: దర్శి నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 5 కార్యకర్తలు, 16 ఆయా పోస్టులు ఖాళీలుగా ఉన్నట్లు ఐసిడిఎస్ దర్శి ప్రాజెక్ట్ అధికారి సిహెచ్.భారతి గురువారం తెలిపారు. తాళ్ళూరు మండలంలోని తురకపాలెం-1లో ఓసి జనరల్, కురిచేడు మండలంలోని కురిచేడు ఎన్ఎస్‌పి ఓసి జనరల్, దొనకొండ మండలంలోని ఆరవేళ్ళపాడు-1లో బిసి-డి, దర్శి మండలంలోని శివరాజునగర్-1లో బిసి-ఎ, అన్నవరంలో ఓసి జనరల్‌గా అంగన్‌వాడి కార్యకర్త పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. దొనకొండ మండలంలోని రుద్రసముద్రం-1లో ఎస్సీ, రుద్రసముద్రం-2లో బిసి-డి, మంగినపూడి-1లో ఓసి జనరల్, కొచ్చర్లకోట-2లో ఓసి జనరల్, బాదాపురం-2లో బిసి-ఎ, కురిచేడు మండలంలోని రామాంజనేయ కాలనీలో ఎస్సీ, మంగంగవరంలో ఓసి జనరల్, ఆవులమండలో ఓసి జనరల్, దర్శి మండలంలోని దర్శి రామాలయం గుడిలో ఓసి జనరల్, వడ్డే బజార్ ఓసి జనరల్,, రామాలయం స్ట్రీట్ ఓసి జనరల్, తాళ్ళూరు మండలంలోని రామభద్రాపురం ఓసి జనరల్, తాళ్ళూరు-1లో ఎస్సీ, గంగవరం-1లో ఓసి జనరల్, ముండ్లమూరు మండలంలోని పలుకురాళ్ళతండా ఎస్టీ, పూరిమెట్ల-1లో బిసి-ఎ ఆయా పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఈ ఖాళీలు పూర్తి చేయడానికి శాఖ పరిధిలో ఆయా గ్రామాలలో రిజర్వేషన్ల ప్రాతిపదికన దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈనెల 11వ తేదీ నుండి 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు. 21 నుంచి 35 సంవత్సరాలలోపు వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మండల స్థాయి అధికారులకు శిక్షణ

ప్రజాశక్తి-పీసీపల్లి: మండల స్థాయి అధికారులకు, సచివాలయ సిబ్బందికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తీసుకోవాల్సిన చర్యలు గురించి వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి డి.నాగమల్లేశ్వరి, పంచాయతీ రాజ్ ఏఈ తిరుపాలయ్య, వెలుగు ఏపీఎం జి.సత్యానందం పాల్గొన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి-పీసీ పల్లి

ట్రాక్టర్ డ్రైవర్లకు ఎస్ఐ జి.కోటయ్య గురువారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సీజన్లో కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. పొగాకుతో వెళుతున్న ట్రాక్టర్ డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రాణం చాలా విలువైనదని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బహిరంగ మూత్ర విసర్జన నిషేధం

ప్రజాశక్తి-దర్శి: దర్శి నగర పంచాయతీ పరిధిలో బహిరంగ మల, మూత్ర విసర్జన నిషేధించడమైనదని కమిషనర్ వై.మహేశ్వరరావు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు దర్శి నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పట్టణంలోని పొదుపు మహిళా స్వయం సహాయక సభ్యులు, వార్డు సభ్యులతో కలిసి బహిరంగ మల, మూత్ర విసర్జన రహిత పంచాయతీగా తీర్మానించారని తెలిపారు. మల విసర్జన చేస్తే రూ.50, మూత్ర విసర్జన చేస్తే రూ.30 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని కోరారు.

జగన్‌ను కలిసిన ఉపసర్పంచి యూతామ్

ప్రజాశక్తి-కొనకనమిట్ల: మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని కొనకనమిట్ల మండలం వద్దిమడుగు వైసీపీ యూత్ నాయకుడు, ఉప సర్పంచి భూదాల యూతామ్ తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. వీరితో పాటు గ్రామస్తులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు యాంటీ థెఫ్ట్ బోల్టులు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-మర్రిపూడి

ఇటీవల కాలంలో మండలంలోని పలు గ్రామాలలో రైతులకు సంబంధించిన వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనాలకు గురయ్యాయని, ఈ నేపథ్యంలో వాటికి యాంటీ థెఫ్ట్ బోర్డు ఏర్పాటు చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారెడ్డి సూచించారు. గురువారం ఇందుకు సంబంధించి రైతుల అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్ ఫార్మర్లకు యాంటీ థెఫ్ట్ బోల్టులను బిగించడం వలన వాటిని దొంగిలించడం కష్టతరంతో కూడుకున్న పని అవుతుందన్నారు. కాబట్టి కొంతవరకు దొంగతనాలను నివారించవచ్చన్నారు.

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని పాపిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి వెన్నపూస వెంకటరెడ్డి కుమారుడు శివప్రసాద్‌రెడ్డి, భవాని వివాహ వేడుకల్లో దర్శి ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైసిపి అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుమ్మిత అంజిరెడ్డి, తాళ్లూరు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి, నాయకులు పులి ప్రసాద్‌రెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండల కేంద్రమైన తాళ్ళూరులో మండల వ్యవసాయశాఖ అధికారి బి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పంట కోత నిర్వహణ మరియు పంటల విలువల జోడింపుపై శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖ అధికారి బి.ప్రసాదరావు మాట్లాడుతూ పంట కోతల తరువాత, పంట ఉత్పత్తులను నిల్వ చేయడం, వాటి నిర్వాహణతోపాటు వాటికి విలువ జోడింపు చేసినట్లయితే అధిక ధరలకు అమ్ముకోవడమే కాక ఆరోగ్యకరమైన, నాణ్యమైన రీతిలో వినియోగించుకోవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం పి.దేవరాజ్, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

ప్రజాశక్తి- పొదిలి



సచివాలయం వద్ద నోటిఫికేషన్ అంటిస్తున్న అధికారులు

నీటి వినియోగదారుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని మండల తహశీల్దార్ ఎంవి కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో గుత్తా శోభన్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బందితో జరిగిన శిక్షణ సమావేశంలో మాట్లాడారు. మండలంలో తీగదుర్తిపాడు, రామాపురం, ఏలూరు, పొదిలి పెద్ద చెరువు పొదిలి చిన్న చెరువు సంబంధించి ఎన్నికలు ఎలాంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.కె.జైనులాబ్దిన్, ఇరిగేషన్ ఏఇ విశ్వనాథ్, మండల పంచాయతీ సెక్రటరీలు వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎస్ పురంరూరల్ : సాగునీటి సంఘం ఎన్నికలలో రైతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహశీల్దార్ డి.మంజునాథరెడ్డి తెలిపారు. ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్‌ను సచివాలయాల వద్ద ప్రచురించారు. మండలంలో 12 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

శింగరాయకొండ: ఈనెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ టి.రవి తెలిపారు. గురువారం శింగరాయకొండ తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందుగా సాధారణ సర్వసభ్య మండల సమావేశాన్ని ప్రారంభించి, ఓటర్లను ఎన్నికల కేంద్రానికి అనుమతిస్తామన్నారు. మండలంలో సోమరాజుపల్లి, పాకల, బింగినపల్లి, కలికివాయి, కనుమల్ల గ్రామాలతో ఈ ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రైతులు సహకరించాలని కోరారు. ఏకగ్రీవాలు అయితే ఆ చెరువుకి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-కొండపి

పొగాకు బోర్డు పరిధిలోని ధర్మవరం గ్రామంలో గురువారం పొగాకు రైతులకు ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి జి.సునీల్ కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజులలో అల్పపీడనం ప్రభావం వలన అధిక వర్షపాతం సంభవించినట్లయితే పొగాకు రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పొగాకులో అన్య పదార్థములు అనగా గుట్కా, ఖైనీ, సిగరెట్, బీడీలు, చాక్లెట్లు, ఇతర ప్లాస్టిక్ పదార్థములు, ఎరువుల బస్తాలు, నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటిసి కంపెనీ మేనేజరు రత్నం, జీపిఐ కంపెనీ మేనేజర్ కుమారి స్వాతి, పొగాకు బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ సాగర్ బాబులు పొగాకు పంట నియంత్రణ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఏ పరిస్థితుల్లోనూ అధిక విస్తీర్ణంలో నాటడం అధికంగా పండించటం చేయరాదన్నారు. క్రిమిసంహారక మందులు వాడకాన్ని వీలైనంతగా తగ్గించుకొని సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు గ్రామంలోని పొగాకు పంటను, బ్యారెన్లను పరిశీలించారు.

మద్దిపాడు: మండల పరిధిలోని నాగన్నపాలెంలో గురువారం శనగ, పొగాకు పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు డిడిఏ డిఆర్‌సి ఎస్.రామ్మోహన్ రావు మాట్లాడుతూ శనగ పైరులో వచ్చు ఎండు తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఒంగోలు ఏడిఏ డిఆర్ సి.వెంకట్రావు, ఏవో కె.రమేష్ బాబు, వీఏఏ చాందిని పాల్గొన్నారు.

పొదిలి: మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్కే జైనులబ్దిన్ సూచించారు. మంగళవారం మండలంలోని కొండాయపాలెం, మూగచింతల గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. మినుము పంటను పరిశీలించారు. ఈ పంటలో ఎక్కువగా పల్లాకు తెగులు సోకిందని ఇది తెల్ల దోమ నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

మాజీ మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని వైసిపి బాపట్ల జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని కనగాల గ్రామంలో ఇటీవల వర్షాలకు నేల వాలిన వరి పైరును వైసిపి రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట వర్షం కారణంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. దిగుబడి కూడా పడిపోయినట్లు తెలిపారు.గిట్టుబాటు ధర కూడా లేదని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ అధికారంలోకి రాకముందు ఇష్టం వచ్చినన్ని హామీలు ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పుడు రైతులను ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. గతంలో వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నాయుడు తాము అధికారంలోకి వస్తే రూ.20000 రైతు భరోసాగా అంద జేస్తానని హామీ ఇచ్చి అమలు చేయడంలో విఫలమయ్యాడని విమర్శించాడు. రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడుతామన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని వైసిపి ఆధ్వర్యంలో ఈనెల 13న అన్ని జిల్లాల కలెక్టర్ల కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు యార్లగడ్డ మదన్, బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




నేల వాలిన వరిపంటను మాజీ మంత్రి మేరుగ నాగార్జు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి-వేటపాలెం

భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మండల వెల్ఫేర్ స్కీమ్స్ ప్రత్యేక అధికారి, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ రాజాదే బోరా తెలిపారు. వేటపాలెం మండలం రామన్నపేట పంచాయతీలో రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా భూమి సర్వే చేయాలనీ కోరుతూ నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తహశీల్దారు పి. పార్వతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ విశ్వనాథం, పంచాయతీ సెక్రటరీ బాలిగ సురేంద్ర, వెలుగు ఎపిఎం కె.అంజిబాబు పాల్గొన్నారు

చీరాల : భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దారు గోపికష్ణ తెలిపారు. మండల పరిధిలోని తోటవారిపాలెం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ భూ సమస్యలకు సంబంధించిన అన్ని రికార్డులను రెవెన్యూ సదస్సుల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. అనంతరం రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు అర్జున్, ఆర్ఐ కుమార్, ఎండోమెంట్ మేనేజర్ శివ నాగదాసు,సర్వేయర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



వేటపాలెంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

రేపల్లె : భూ సమస్యలను పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని నల్లూరు సౌత్ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా భూముల కొలతలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఆన్‌లైన్‌లో నమోదు తదితర సమస్యలపై అర్జీలను రైతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలు చేయాలి

ప్రజాశక్తి- ఇంకొలు

మొండి బకాయిలు వసూలు చేయాలని స్త్రీనిధి ఎజిఎం కె. నాగబాబు తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి స్త్రీ నిధి లోన్ ఎలిజిబిలిటి రూ.4.50 కోట్లు ఉన్నట్లు తెలిపారు. మండల పరిధిలోని ఇడుపులపాడు గ్రామంలో బకాయిలు ఎక్కువగా ఉన్నట్లు తెలిపారు. ఆ బకాయిలను వసూలు చేస్తే స్త్రీనిధికి సంబంధించి కొత్త లోన్లు పెట్టే అవకాశం ఉందన్నారు. మొండి బకాయిలు ఉన్న ప్రతి గ్రూప్ సభ్యురాలికి మండల సమాఖ్య నుంచి నోటీసులు జారీ చేయాలని ఎపిఎంను ఆదేశించారు. ఎటిఎం అనురాధ మాట్లాడుతూ గ్రూప్ సమావేశాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. బుక్ కీపింగ్ కు సంబంధించి శ్రద్ధ వహించాలన్నారు. మొండి బకాయిలపై అందరూ దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘాల సహాయకులు, సిసిలు అశోక్, అంజిరెడ్డి, రాజశేఖర్, మండల సమాఖ్య అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-వేటపాలెం

అక్రమంగా మట్టితరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద అనుమతి పత్రాలు లేక పోవడంతో జరిమానా విధించారు. వేటపాలెం మండలం చల్లారెడ్డి పాలెం పంచాయతీ పరిధిలోని బొచ్చుల వారి పాలెం వద్ద 216 జాతీయ రహదారిపై మట్టితరలిస్తున్న ట్రాక్టర్లను తహశీల్దారు పార్వతి ఆపి తనిఖీ చేశారు. వారి వద్ద ఎలాంటి పత్రాలు లేవు. దీంతో ఒక్కొక్క ట్రాక్టర్‌కు రూ.3 వేల వంతున జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో డిటీ శ్రీకాంత్, అక్కయ్యపాలెం విఆర్ఒ బాషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

సుస్థిరాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎపిఎస్ఐఆర్‌డి జేడీ కేశవరెడ్డి

ప్ర జాశక్తి-పర్చూరు

పంచాయతీల సుస్థిరాభివృద్ధిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎపిఎస్ఐఆర్‌డి జేడీ కేశవరెడ్డి తెలిపారు. గ్రామాల సుస్థిరాబివృద్ధిపై స్థానిక ఎంఆర్‌సి కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శిలు, సచివాలయం సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడానికి ఐక్య రాజ్యసమితి 9 లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. ఆ లక్ష్యాలు అమలు చేయడానికి లక్ష్యసాధనకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. అందులో భాగంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఎంపిడిఒ ప్రద్యుమ్నా కుమార్ మాట్లాడుతూ గ్రామ అభివద్ధి ప్రణాళికలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యే విధంగా ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. అనంతరం నిర్దేశించిన తొమ్మిది లక్ష్యాలపై ఇఒఆర్‌డి సత్యనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశవరెడ్డి

భట్టిప్రోలు : అధికారులు,ప్రజాప్రతినిధుల సమన్వయంగా పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపిపి డివి.లలితకుమారి తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిరాభివద్ధి, లక్ష్యాల స్థానికీకరణ అనే అంశంపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. తొలుత మహాత్మా గాంధీ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి టి. ఉదయభాస్కరి, ఇఒపిఆర్‌డి టి.ఊహారాణి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : మండల పరిధిలోని అధికారులు, ప్రజా ప్రతినిధులకు సుస్థర అభివృద్ధి, లక్ష్యాలపై ఈనెల 16 నుంచి 19వరకూ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ శిక్షణా తరగుతులు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు, లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులు, సచివాయ సిబ్బందికి రెండు బ్యాచ్ లుగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు అధికారులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హజరు కావాలని ఆయన కోరారు.



సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనంబాబు

సహాయనిధి చెక్కులు అందజేత

ప్రజాశకి-వేమూరు

మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన దాసరి మల్లికార్జునరావు, వేమూరు గ్రామానికి చెందిన యలమాటి రాజ్యలక్ష్మి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరయ్యాయి. బాధితులకు ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు చేతుల మీదుగా గురువారం చెక్కులుయ అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమవరం మండల టిడిపి అధ్యక్షుడు,మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ విజయబాబు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - రేపల్లె

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ ఆర్టికల్ 341ను పరిరక్షించాలని కోరుతూ ఈనెల 15న నిర్వహిస్తున్న మాలల మహాగర్జన బహిరంగ సభను జయప్రదం చేయాలని న్యాయవాది, జై భీమ్ రావు భారత్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దోవా రమేష్ రాంజీ కోరారు. గుంటూరు పట్టణంలోని నల్లపాడు వద్ద అఖిల భారత మాల సంఘాల జెఎసి చైర్మన్ ఉప్పులేటి దేవి ప్రసాద్ సారధ్యంలో ఈ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహా గర్జనకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్ రాంజీ మాట్లాడుతూ మాలల ఐక్యత, ఆత్మగౌరవం నినాదంతో లక్షలాదిమంది మాలలతో జాతి సమైక్యత కోసం ఈ బహిరంగ సభ నిర్వహిస్తునన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేపల్లె మండల కన్వీనర్ కర్రా బాబూరావు, మాల సంఘాల ప్రతినిధులు చెరుకూరి లక్ష్మణరావు, వాగోలు రమేష్ బాబు, నీలా వాసు బాబు, రాంబాబు, నెరుసు వెంకటరావు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్

రైతు సేవా కేంద్రంలో జేసీ తనిఖీ

ప్రజాశక్తి - నిజాంపట్నం

మండల పరిధిలోని పల్లపట్ల రైతు సేవా కేంద్రాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖార్‌జైన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు.ధాన్యం నమూనాలు తీసే విధానాన్ని పరిశీలించారు.ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై ఆరా తీశారు. రైతుల నుంచి ఇప్పటివరకు ఎంత వరకు ధాన్యం కొనుగోలు చేపట్టారో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం నాణ్యత ప్రమాణాలు అలాగే ధాన్యం కనీసం మద్దతు ధర తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. అనంతరం రైతులతో మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించుకోని కనీస మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డిఎస్ఒ విలియమ్స్, జిల్లా వ్యవసాయ అధికారి రామకష్ణ, జిడిసిఎంసి గోపాలకష్ణ, రేపల్లె ఆర్‌డిఒ రామలక్ష్మి, తహశీల్దారు షాకిర్ పాషా, ఎఒ శారద, సిఎస్‌డీటీ ఓంకార్, వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను దగా చేసిన చంద్రబాబు

- నేడు కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి
- జడ్పీ ఛైర్‌పర్సన్‌ను దించటం ఎవరితరం కాదు
- వైసిపి జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివ ప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దగా చేశారని వైసిపి జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి విమర్శించారు. వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రైతులను మోసం చేసిన ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలో పార్టీ శ్రేణులు, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం నిరసన కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు ఇస్తామన్న రూ.20 వేల భరోసా డబ్బులు ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. పంటలు నష్టపోయిన వారికి పరిహారం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి, జడ్పీ ఛైర్‌పర్సన్ వెంకాయమ్మ

చెల్లించడంలో విఫలమైందని, నేటికీ రైతుల పంటలకు ఇన్సూరెన్స్ ప్రభుత్వం చేయలేదన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రైతులకు ఇన్సూరెన్స్‌తో పాటు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల పంటలను మద్దతు ధరలకు అమ్ముకాలు కొనసాగించామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు రైతులకు ఏవిధంగా అండగా ఉన్నామో ఇప్పుడు కూడా రైతులకు అదేవిధంగా అండగా ఉంటామన్నారు. రైతులకు మద్దతుగా శుక్రవారం అంబేద్కర్ భవనం నుండి కలెక్టరేట్ వరకు నిరసన ర్యాలీ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీలో రైతులు, వైసీపీ క్యాడర్ ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నాను.

జడ్పీ ఛైర్‌పర్సన్‌ను దించటం ఎవరితరమూ కాదు

త్వరలో జడ్పీ ఛైర్‌పర్సన్‌కు ఎసరు అంటూ జిల్లాలో కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఆ పదవి నుంచి బూచేపల్లి వెంకాయమ్మను దించటం ఎవరితరం కాదని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని తాను కలిస్తే పట్టించుకోవడం లేదంటూ టిడిపి నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాన్ని కొందరు టిడిపి సానుభూతిపరులు మానుకోవాలన్నారు. మాజీ సిఎం జగన్ వైసిపి క్యాడర్‌ను ఎప్పుడు నిర్లక్ష్యం చేయరని, పార్టీ నాయకులంటే ఆయనకు ఎంతో గౌరవమన్నారు. జమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు తాము సిద్ధమని బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి ఒంగోలు నియోజకవర్గ కోఆర్డినేటర్ చుండూరి రవిబాబు, ఒంగోలు నగర అధ్యక్షులు కఠారి శంకర్, రొండా అంజిరెడ్డి, నాయకులు డి.క్రాంతికుమార్, ఎం.సుబ్రహ్మణ్యరెడ్డి, భొట్ల సుబ్బారావు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

వైద్య వృత్తి పవిత్రమైంది

డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సృజన

ప్రజాశక్తి-కొనకనమిట్ల

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని, చిన్న వయస్సులోనే వైద్యాధికారి పృథ్వీరాజ్ పీజీకి ఎంపిక కావటం గర్వంగా ఉందని కనిగిరి డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ సృజన అన్నారు. గురువారం గొట్లగట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేస్తూ ఉన్నత వైద్య విద్య కోసం మంగళగిరి ఎన్ఆర్ఐ మెడికల్ కళాశాలకు వెళ్లిన సందర్భంగా వీడ్కోలు సభ నిర్వహించారు. కొనకనమిట్ల ప్రాథమిక వైద్యాధికారి ఎస్‌పి.బాలయ్య మాట్లాడుతూ డాక్టర్ పృథ్వీరాజ్ వెనుకబడిన గ్రామీణ ప్రాంతంలో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించి, కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. బదిలీపై వెళ్తున్న వైద్యాధికారి పృథ్వీరాజును శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు ఎస్‌పి.బాలయ్య, సౌజన్య, సుగుణ కుమార్, రుషిత, సందీప్, బ్లెస్సి, శంకర నాయక్, వడ్డె నరేంద్ర, హెచ్ఇఓ నారాయణరెడ్డి, పిహెచ్ఎం శైలజ, సిహెచ్ఓ రంగస్వామి, ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీర జవాన్ సుబ్బయ్య కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి - పొదిలి

దేశ రక్షణ కోసం గత 23 సంవత్సరాలుగా సైన్యంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ జమ్మూ కాశ్మీర్‌లో విధులు తీవ్రవాదులు అమర్చిన ల్యాండ్ మైన్ నుంచి తన తోటి సైనికులు 30 మంది ప్రాణాలు కాపాడి అమరుడైన వరికుంట సుబ్బయ్య కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా ఒక ప్రకటనలో తెలిపారు. సుబ్బయ్య మృతి పట్ల కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తుందన్నారు. మృత్యువుపోనూ తన తోటి వారిని ఆదుకోవాలని ధైర్య సాహసాలను ప్రదర్శించి వారిని అప్రమత్తం చేసి 30 మంది ప్రాణాలను కాపాడిన సుబ్బయ్యకు కేంద్ర ప్రభుత్వం పరమ వీర చక్ర అవార్డు ఇవ్వాలని, ఒక సామాన్య రైతు కుటుంబమైన ఆ కుటుంబానికి, వారి భార్య బిడ్డలకు, తల్లిదండ్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. సుబ్బయ్య సతీమణికి స్పెషల్ పెన్షన్, ఐదు ఎకరాల వ్యవసాయ భూమి, ఐదు సెంట్ల ఇళ్ల స్థలం, ఇంటిని నిర్మించి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుందని షేక్ సైదా తెలిపారు.


దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏవో జైనులాబ్దిన్

నకిలీ పురుగుమందులు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-పొదిలి

రైతులకు నకిలీ పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో ఎస్.కె. జైనులాబ్దిన్ హెచ్చరించారు. సోమవారం పట్టణంలోని వివిధ ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేశారు. ఏడాది సరైన వర్షపాతం లభించడంతో రైతులు కంది, మిరప, బొబ్బర్లు, పొగాకు ప్రధాన పంటలుగా సాగు చేశారన్నారు. అవి ఏపుగా పెరిగి పూత దశలో ఉన్నాయని, ఈ దశలో పంటలకు ఆశించే తెగుళ్ళ నివారణకు పురుగుమందుల వినియోగం నేపథ్యంలో నకిలీ పురుగుమందులు అమ్మవద్దని హెచ్చరించారు.

మాలల మహాగర్జనను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

గుంటూరులో ఈనెల 15న మాలలు తలపెట్టిన మహా గర్జనకు వేలాదిగా తరలిరావాలని నియోజకవర్గ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షులు కోటికల బాలబాదుర్ల అన్నారు. గురువారం హనుమంతునిపాడు తురకపల్లి, కుటుగుల్ల, హాజీపురం, దొడ్డిచింతల, మాసాయిపేట గ్రామాలలోని పల్లెల్లో మాలల మహా గర్జనకు భారీగా జన సమీకరణ చేసి తరలి రావాలని వాల్ పోస్టర్లు రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలలు త్యాగాలకి మారుపేరని, అలాంటి వారిని దోపిడీదార్లు, దొంగలు అంటూ నోటికొచ్చినట్టు మాట్లాడుతున్న మందకృష్ణకు బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్ర మాలల సత్తా ఏమిటో ప్రభుత్వాలకు కూడా చూపించాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. ఈ రాష్ట్రంలో 80 లక్షల మంది మాలలు ఉంటే పాలక ప్రతిపక్షాలకు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని వారికి మనం గుణపాఠం చెప్పగా తప్పదని అన్నారు. రాజకీయ పార్టీలు కేవలం వారి అవసరాలకి మాలలను వాడుకుంటున్నారని ప్రభుత్వ పథకాలలోనూ


మహాగర్జన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రాజకీయ పదవుల్లో ఉద్యోగాలలో మాలలకు తీరని అన్యాయం జరుగుతుందని అన్నారు. రాజ్యాంగంలో 341 ఆర్టికల్‌ను సవరించి రిజర్వేషన్ వర్గీకరిస్తే మాకు ఎటువంటి అభ్యంతరం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సహాయ కార్యదర్శి దమ్ము శ్రీనివాసులు, ఉస్తెల బెంజిమాన్, పాప బత్తిన కాశయ్య, కోలా పోతయ్య, జల్లి నారాయణ, వేము వెంకయ్య, గొట్టిముక్కల ప్రేమ్, కట్టా రాంబాబు, నాగేంద్ర, నడవ గురురాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు

సిబ్బందికి అవగాహన సదస్సు

ప్రజాశక్తి-దర్శి

విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారి కట్ట వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం స్థానిక పొదిలి రోడ్డులోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో దర్శి ఇఇ కార్యాలయం పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందితో అవగాహన సమావేశం ఇఇ పి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఇ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్కడక్కడ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ జరగకుండా చూడాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. చాలా కార్యాలయాల పరిధిలో బకాయిలు ఉన్నాయని, ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా కట్టించాలని కోరారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా వన్ కె.వి రూ.30 వేలు, 2 కెవి రూ.60 వేలు, త్రీకె.వి రూ.75 వేల రూపాయలు సబ్సిడీ వస్తుందన్నారు. మొదటి కోటి మందికి దేశంలో ఈ అవకాశాన్ని వస్తుందన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఇ కట్ట వెంకటేశ్వర్లు

సామాజిక తనిఖీ సమర్థవంతంగా చేపట్టాలి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణంలోని డ్వామా కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బందితో కోఆర్డినేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారి ఝాన్సీ రాణి పాల్గొని మాట్లాడారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి కనిగిరి మండలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సామాజిక తనిఖీని సమర్ధవంతంగా చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ సిబ్బంది సామాజిక తనిఖీ సిబ్బందికి రికార్డులు అన్నీ అందించి సామాజిక తనిఖీకి సహకరించాలని సూచించారు. సామాజిక తనిఖీలో అక్రమాలు, అవినీతి నిరూపణ జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. తప్పు చేసిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో హనుమంతరావు, ఏపీడీలు రాజారావు, వెంకటస్వామి, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ టి.వెంకటేశ్వర్‌రావు, ఏపీవో ఎస్.కె జహంగీర్ భాష, ఉపాధి హామీ సిబ్బంది, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

హైసెక్యూరిటీ పేపర్లు లేక ఇక్కట్లు

ప్రజలకు అందని ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి-పీసీపల్లి

హై సెక్యూరిటీ పేపర్లు లేక మండల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మీసేవ, సచివాలయాల్లో ఏ ధ్రువీకరణ పత్రం కావాలన్నా ఈ హైసెక్యూరిటీ పేపర్లపై ప్రింట్ చేసి ఇస్తుంటారు. ప్రస్తుతం ఈ పేపర్లు రాకపోవడంతో ధ్రువీకరణ పత్రాలు సిద్ధమైనా ప్రింటింగ్ ఇవ్వడం సాధ్యం కావడం లేదు. దీంతో ప్రజలకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఒక్కో సర్టిఫికేట్‌కు రూ.50 వసూలు చేస్తోంది. కానీ గత వారం రోజులుగా పీసీపల్లిలో హైసెక్యూరిటీ పేపర్లు లేవు. ఈ పేపర్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయం అధికారులు జిల్లాలోని గ్రామ వార్డు సచివాలయ కార్యాలయం నుంచి తీసుకవచ్చి సచివాలయాలకు సరఫరా చేస్తారు. కానీ గత వారం రోజులుగా ప్రభుత్వం సరఫరా చేసే పేపర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు

ఎక్సైజ్ సిఐ లీలా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బెల్టు షాపులు నిర్వహిస్తే.. చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు ఎక్సైజ్ సిఐ లీలా హెచ్చరించారు. గురువారం నాడు ఆమె మీడియాతో మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ వచ్చిన తర్వాత తమ స్టేషన్ పరిధిలో 23 బెల్టు షాపులపై దాడులు చేసి.. నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు. మొత్తం 261 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బెల్టుషాపులు ఎక్కడైనా ఉంటే దానికి సంబంధిత వైన్ షాపు


ఎక్సైజ్ సిఐ లీలా

ఓనర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వైన్‌షాప్ నిర్వాహకులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. నిబంధనలు పాటించని వైన్ షాపుల లైసెన్సును ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రద్దు చేస్తామని చెప్పారు. వైన్ షాపుల్లో ఒక వ్యక్తికి మూడు బాటిళ్లకు మించి విక్రయించకూడదన్నారు. ఎమ్మార్పీ రేట్లకు మించి మద్యం అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.